**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్‌లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంప్రదించ వలసిన నెంబర్:
7095999737,9908103501



# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

కంప్లిమెంటరీ కాపీ    ఎడిటర్: రాపోలు లింగస్వామి    25 -08 -2026 మంగళవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam,    పేజీలు:4    వెల: 2-00


## నా పర్యటనను అడ్డుకోవడం

# తెలంగాణ ప్రజలను అవమానించడమే

హైదరాబాద్, ఆగస్టు 24: వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు.



**కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారు..**

టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు.

3వ పేజీలో ..

## టీయూడబ్ల్యూజే కార్యాలయాన్ని సందర్శించిన చండీగఢ్ ప్రెస్ క్లబ్ బృందం



హైదరాబాద్ ఆగస్టు 24: చండీగఢ్ ప్రెస్ క్లబ్ ఆఫీస్ బేరర్ల బృందం సోమవారం బషీర్ బాగ్ లోని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీయూడబ్ల్యూజే) కార్యాలయాన్ని సందర్శించింది. చండీగఢ్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దుగ్గల్ నేతృత్వంలోని జర్నలిస్టుల బృందం ఈ సందర్భంగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఐజేయు మాజీ అధ్యక్షుడుకే శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను శ్రీనివాస్ రెడ్డి వారికి వివరించారు. అలాగే జర్నలిస్టుల వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం యూనియన్ చేస్తున్న కృషిని వివరించారు. హైదరాబాద్ కేంద్రంగా యూనియన్ కార్యకలాపాల పనితీరును వారికి వివరించారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన పలు కార్యక్రమాల వివరాలను తెలుసుకొని చండీగఢ్ జర్నలిస్టుల బృందం ప్రశంసించింది. వృత్తిపరంగా నిబద్ధత కలిగిన జర్నలిస్టుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని అభినందించింది. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి వారి వెంట ఉన్నారు.

## కొండా సురేఖ అంశం క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుంది



హైదరాబాద్, ఆగస్టు 24: మంత్రి కొండా సురేఖ అంశం క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ నిర్ణయాన్ని అందరూ అంగీకరించాల్సిందేనని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కొండా సురేఖ అంశంపై స్పందించారు. అధిష్ఠానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిం దేనని పేర్కొన్నారు.అంతర్గత వ్యవహారాలపై మాట్లాడనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అలాగే ఊహాజనిత కథనాలపై స్పందించనని సీఎం రేవంత్ రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఈ సమావేశంలో తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దురుద్దేశపూర్వకంగానే తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని తెలిపారు.మరో వైపు మంత్రి కొండా సురేఖ జన్మదినం సందర్భంగా గీసుకొండలో ఆమె అభిమానులు వేడుకలు నిర్వహించారు. దీనికి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.దీనిపై క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. దాంతో ఆ కమిటీకి కొండా సురేఖ వరుసగా రెండు లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ చూస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆ రిపోర్టు వచ్చాకే నిర్ణయం



మెదక్, ఆగస్టు 24: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు.

4వ పేజీలో ..

## ఈగల్ శాఖలో ఇంటి దొంగల బాగోతం..

హైదరాబాద్, ఆగస్టు 24: డ్రగ్స్ నిర్మూలన కోసం పనిచేసే ఈగల్ శాఖలోనే ఇద్దరు కానిస్టేబుల్స్ డ్రగ్స్ దందాకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. ఈగల్ ఇంటి దొంగలైన కానిస్టేబుల్ నరహరి, స్వామిలపై అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ.50 లక్షలు విలువైన ఎక్సటసీ పిల్స్‌ను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్స్.. దీనికి సంబంధించిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వనట్లు తెలుస్తోంది. 50 లక్షల విలువైన ఒక కిలో ఎక్టసీ మాత్రలను అక్రమంగా విక్రయించేందుకు వీరిద్దరూ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఏకంగా డ్రగ్ పెడ్లర్లను సంప్రదించినట్లు సమాచారం.ఒక డ్రగ్ పెడ్లర్‌ను పట్టుకునేందుకు హెచ్‌న్యూ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో.. కానిస్టేబుళ్లు నరహరి, స్వామిల బాగోతం బట్టబయలైంది. గతంలో వీరిద్దరూ పలు విజయవంతమైన యాంటీ డ్రగ్స్ ఆపరేషన్స్ చేసి అవార్డులు కూడా అందుకున్నారు. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ఈగల్ టీం.. ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి దూరం పెట్టినట్లు తెలుస్తోంది. నరహరి, స్వామిలపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. డ్రగ్స్ పెడ్లర్లతో వీరికి ఉన్న సంబంధాలు, ఎక్టసీ మాత్రలు ఎక్కడి నుంచి వచ్చాయి, ఈగల్ శాఖలో మరెవరైనా ఇందులో భాగస్వాములై ఉన్నారా అనే కోణంలో ఈగల్ అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.




## జాబ్ నోటిఫికేషన్లు నిల్..

## లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.




## నాడు తల్లిదండ్రులను పొట్టనపెట్టుకుంది.. నేడు తానే..




సంగారెడ్డి,: ఈ ఏడాది జనవరిలో ప్రేమించిన ప్రియుడి కోసం తల్లిదండ్రులకు మత్తు ఇంజెక్షన్ ఇచ్చి హతమార్చిన సురేఖ అనే యువతి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులను పొట్టనపెట్టుకున్న మత్తు ఇంజెక్షన్‌తోనే తన ప్రాణం కూడా తీసుకుంది. వివరాల్లోకెళితే... వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం లోని యాచారం గ్రామానికి చెందిన సురేఖ సంగారెడ్డి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న సమయంలో ఓ యువకుడిని ప్రేమించింది.తన ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పగా..వారు నిరాకరించారు. ప్రేమ పెళ్లి కుదరదని వారించారు. దీంతో తల్లిదండ్రులపైనే ఆగ్రహం పెంచుకున్న సురేఖ ఇంజెక్షన్‌లో మత్తుమందు కలిపి ఇచ్చి వారిని కడతేర్చింది. తల్లిదండ్రులు అనారోగ్యంతో చనిపోయినట్టు చిత్రీకరించే ప్రయత్నం చేసింది.అయితే.. పోలీసులకు సురేఖపై అనుమానం రావడంతో దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. ఈ కేసులో అరెస్టైన సురేఖ కొన్ని రోజుల క్రితమే జైలు నుంచి బయటకి వచ్చింది. తిరిగి సంగారెడ్డికి వెళ్లిన ఆమె..శాంతినగర్‌లో ఓ ప్రైవేట్ హాస్టల్లో బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

## సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల కమ్యూనిస్ట్ నాయకుల సంతాపం



హైదరాబాద్: సీపీఎం సీనియర్ నాయకులు, అఖిల భారత రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల కమ్యూనిస్ట్ లీడర్లు సంతాపం తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డి గారి మృతి రైతాంగ ఉద్యమానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ నెల్లికంటి సత్యం తెలిపారు. వ్యవసాయ రంగం, ఆర్థిక వ్యవస్థ, సాగునీటి ప్రాజెక్టులపై మల్లారెడ్డి గారికి ఉన్న విశేషమైన అనుభవం, అవగాహన ఎంతో గొప్పవని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజా, రైతాంగ సమస్యలపై నిబద్ధతతో పనిచేసిన మల్లారెడ్డి గారి సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు, సహచరులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని నెల్లికంటి సత్యం ఆకాంక్షించారు.

# సంపాదకీయం

## ఆనాటి భారత్?చైనా జ్ఞానమైత్రి ఇప్పుడూ కావాలి!

స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తి అవుతున్న తరుణంలో 'కాక్రోచ్' పేరుతో వార్తల్లో క్రియాశీలంగా మారిన ఒత్తిడి గుంపులను మన మేధావులు కొందరు కేంద్ర ప్రభుత్వ వైఫల్య కోణం నుంచి చూస్తున్నారు. మరికొందరు అందులో మోదీ సర్కారు తప్పేమీ లేదు, చైనాలోని మన మేలుకోరని మేధావులతో కలిసి ఇక్కడి కొందరు చేస్తున్న కుట్రగా దీన్ని విమర్శిస్తున్నారు. ఇక ఆందోళనలు చేసిన వారిని 'కాక్రోచ్'లు అంటుంటే, చైనాలోని మేధావులను 'ఎలుకలు' అంటున్నారు. సమకాలీన పరిణామాలపై ఈ వ్యాఖ్యలు ఎలా ఉన్నా భారత్?చైనాల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు ఈనాటివి కావు.క్రీ.శ. ఐదవ శతాబ్దిలో మొదలైన జ్ఞానశోధన భారత?చైనాల మైత్రికి పునాదులు వేసింది. ఆధునిక భారత చరిత్రలో నెహ్రూ యుగంగా పరిగణించే కాలంలో ఆ శోధన ఒక స్ఫూర్తి అయింది. ఆనాడు భారత్ నుంచి చైనాకు పెద్ద ఎత్తున పండిత వర్గం వెళ్లి అక్కడ ఏళ్ల తరబడి నివాసం ఉండి వారికి సంస్కృతాన్ని బోధిస్తూ చీనీ భాషలోకి సంస్కృత గ్రంథాలను వారు తర్జుమా చేశారు. వారిలో ప్రముఖుడు కాశ్యప మాతంగ. కీ.శ. 67లో మింగ్ చి చక్రవర్తి ఆహ్వానంపై చైనా వెళ్ళిన కాశ్యప'లో' నదీ తీరంలోని లోయాంగ్ పట్టణంలో నివాసం ఉన్నాడు.భారత్ నుంచి ఇలా చైనా వెళ్ళిన ప్రముఖుల్లో? బుద్ధభద్ర,జీనభద్ర,ధర్మరక్ష, కుమారజీవ, పారమార్థ, జీనగుప్త, బోధిధర్మ మొదలైన వారు ఉన్నారు.వీరిలో ప్రతి ఒక్కరూ తమ శిష్యులతో, బౌద్ధ బిక్షువుల బృందాలతో కలిసి చైనాకు తరలివెళ్లారు.ఒక దశలో (కీ.శ.6వ శతాబ్దికి) ఒక్క లియాంగ్ పరగణాలోనే మూడు వేల మంది భారతీయ బౌద్ధ భిక్షువులు, పది వేల భారతీయ కుటుంబాలు ఉండేవి. వీరు తమతో ఎన్నో సంస్కృత గ్రంథాలను అక్కడికి తీసుకుని వెళ్లి, వాటిని చీనీ భాషలోకి తర్జుమా చేశారు. వీరిలో కొందరు నేరుగా చీనీలో గ్రంథాలనూ రాశారు.కుమారజీవ చీనీ భాషలో 47గ్రంథాలను రాసిన సుప్రసిద్ధ రచయిత. ఇక జీవగుప్త 37 సంస్కృత గ్రంథాలను చీనీ భాషలోకి అనువదించారు.వీరి రాకపోకలకు ఈ సారస్వత ఆదాన ప్రదానాలకు కీ.శ. 427లో ప్రారంభమైన మన నలంద విశ్వవిద్యాలయమే సమన్వయ కేంద్రంగా ఉండేది. ఇలా భారత్ నుంచి చైనా వెళ్ళిన పండితుల వద్ద అక్కడ శిష్యులుగాచేరిన చైనా ప్రముఖులు ఎందరో ఉన్నారు. ప్రముఖ యాత్రా చరిత్రకారుడుగా మన చరిత్ర గ్రంథాల్లో ప్రస్తావించే ఫాహియాన్ (కీ.శ. 337?422) కుమారజీవకు శిష్యుడు. భారత్‌లో పర్యటనకు బయలుదేరే ముందు గురువు కుమారజీవను ఫాహియాన్ సంప్రదిస్తాడు. అప్పుడు కుమారజీవ ఇలా సలహా ఇస్తాడు:'భారత్‌లోనీ సమయమంతా మత సంబంధమైన జ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవడానికే వెచ్చించవద్దు. అక్కడి ప్రజలు,వారి జీవన విధానం కూడా క్షుణ్ణంగా అధ్యయనం చెయ్యి; అప్పుడు చైనాకు ఆ దేశ ప్రజలను అర్థంచేసుకోవడం సాధ్యమవుతుంది".చాలా ఆసక్తికరమైన అంశం ఇది. ఆసియాలోని ఇరుగు పొరుగు దేశాల మధ్య భవిష్యత్తులో ఏర్పడాల్సిన సత్సంబంధాల అవసరాన్ని నాటి పండితులు గుర్తించడం ఇందులో మనకు కనిపిస్తుంది. కుమారజీవ దూరదృష్టి ఫలితాలు హుయన్ త్సాంగ్ (602?664) కాలంలో కనిపిస్తాయి. రెండు దేశాల పాలకుల దృష్టిలో హుయన్ త్సాంగ్ఒక గౌరవనీయుడైన ఇరుదేశాల ప్రతినిధిగా గుర్తింపు పొందాడు. భారత్ నుంచి ఆయన తనతో చైనా తీసుకువెళ్ళిన 645సంస్కృత గ్రంథాలను,అక్కడి చక్రవర్తుల సహకారంతో ఒక పండిత బృందాన్ని ఏర్పాటు చేసి వాటిని చీనీలోకి తర్జుమా చేయించాడు.హుయన్ త్సాంగ్ భారత్ నుంచి చైనా తిరిగి వెళ్ళిన తర్వాత, రెండు దేశాల మధ్య అప్పటి వరకు ఒకరి పట్ల మరొకరికి ఉన్న అభిప్రాయాలకు 'కొత్త చూపు' వచ్చి చేరింది. భారత్‌లో కనూజ్ రాజధానిగా పరిపాలిస్తున్న హర్షవర్ధనుడు ? చైనా టియాంగ్ చక్రవర్తి ఇరువురూ స్నేహపూర్వకంగా రాయబారులను పంపుకున్నారు. ఆసియాలోని ఈ రెండు పెద్ద దేశాల మధ్య సారూప్యత గల అంశాలు స్పష్టమైన రూపుతీసుకున్నాక, వాటి ప్రభావం సమాంతరంగా తూర్పు ఆసియాలో ఉన్న చిన్న దేశాల్లో కనపడింది.ఈ దేశాలు తొలుత బ్రాహ్మణిజం ఆధిపత్యంలో ఉండి, తర్వాత క్రమంగా బౌద్ధంలోకి మారాయి. తొలుత ఈ రెండు మతాలూ ఒక దశ వరకు సామరస్యపూర్వకంగా ఉండేవి. తర్వాత వీటి మధ్య స్పర్ధ మొదలయింది. అయితే ఆ స్పర్ధ క్రమంగా పోరుగా మారడానికి మాత్రం కారణం ఆధ్యాత్మిక వైరం కాదు. అందుకు రాజకీయ, ఆర్థిక, వాణిజ్య కారణాలు ఉన్నాయి అంటారు నెహ్రూ. కాలక్రమంలో సముద్రవాణిజ్య మార్గాల పైన గుత్తాధిపత్యం ఈ దేశాల మనుగడకు కీలకం అయింది. ఐదవ శతాబ్ది నాటికి ఈ దేశాల్లో మహా నగరాలు ఏర్పడ్డాయి.తొలుత జ్ఞాన తృష్ణను తీర్చుకోవడానికి మొదలైన ప్రస్థానం మనిషిని కొత్త తీరాలకు తీసుకువెళితే, కొత్త జాతులతో మొదలై విస్తరించిన స్నేహపూర్వక సంబంధాలు క్రమక్రమంగా వాణిజ్య కేంద్రంగా మారాయి. 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం, పలు మొదటి ప్రపంచ దేశాలను తాకిన స్థాయిలో మనల్ని తాకలేకపోయింది.ఆర్థిక సంస్కరణల అమలులో మన కంటే ముందు ఉన్న ఆసియా దిగ్గజం చైనా అప్పటికే ప్రపంచమాంద్యం ప్రకంపనాలు తనని తాకకుండా నిలువరించగలిగింది.అది మొదలు క్రమక్రమంగా ప్రపంచ దేశాల దృష్టి యూరప్ నుంచి ఆసియా మీదికి మళ్ళింది.18వ శతాబ్ది వరకు ప్రపంచ జీడీపీలో సగభాగం ఆసియాది అంటే అందుకు ఆశ్చర్యం అక్కరలేదు.అయితే,ఈ ఇరుదేశాల ప్రాధాన్యాల్లో ఇప్పుడు 'జ్ఞానం' మసకబారి 'విపణి' పెద్దపీట ఎక్కి కూచుంది.చైనా మళ్ళీ 'సిల్క్ రూట్' పునరుద్ధరణ అంటూ తన వాణిజ్య ఆబకు గత చరిత్ర సొబగులు అద్ది,'వన్ బెల్ట్?వన్ రోడ్'ప్రాజెక్టుతో 'ఆఫ్రో?ఆసియా' మ్యాప్ పైకి దూసుకువచ్చింది.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.



చిట్యాల,నల్లగొండ,జ్యోతి ప్రభంజనం :ఆగస్టు 24:చిట్యాల మండలంలోని వెంబాయి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు ఇరగదిండ్ల శేఖర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చిట్యాల-మునుగోడు ఆటో యూనియన్ సభ్యులు సోమవారం వెంబాయి గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ గుణగంటి అలివేలు వెంకన్న శేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గ్రామానికి చెందిన పోనుగోటి నర్సింగరావు మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే చిట్యాల-మునుగోడు ఆటో యూనియన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందించారు.ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. శేఖర్ మృతి ఆటో డ్రైవర్ల యూనియన్‌కు తీరని లోటని, ఆయన కుటుంబానికి తమ వంతు సహాయాన్ని అందించడం బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. కష్టకాలంలో మృతుడి కుటుంబానికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో చిట్యాల-మునుగోడు ఆటో యూనియన్ అధ్యక్షుడు పానుగుల్ల బుచ్చిరాములు, ఉపాధ్యక్షులు దోడ్డి శ్యామ్, జోగు లింగస్వామితో పాటు సైదులు, శివ, జనార్ధన్, జానయ్య, యాదయ్య, వెంకన్న, చిరంజీవి, నరేష్, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## నేడు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ.

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 24:జ్యోతి ప్రభంజనం :చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు చిట్యాల తహసీల్దార్ ఎం. విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.రేషన్‌కార్డు లబ్ధిదారులు నిర్ణీత సమయానికి మున్సిపాలిటీ కార్యాలయానికి హాజరై స్మార్ట్ రేషన్‌కార్డులను స్వీకరించాలని తహసీల్దార్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో మరింత పారదర్శకత, సౌలభ్యం కల్పించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమానికి




హాజరయ్యేలా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సమస్యల పరిష్కారానికి వినతులు.



చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 24:జ్యోతి ప్రభంజనం :చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ గ్రామాలు, పట్టణానికి చెందిన పలువురు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీడీఓ పాండు, వివిధ శాఖల అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలను అందజేశారు.చిట్యాల పట్టణంలో తరచూ ఎదురవుతున్న లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ చిట్యాల పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు శ్రీను అధికారులకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సమస్యల కారణంగా ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.అలాగే ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను చెల్లించాలని ఆయన కోరారు.మరోవైపు ఆరెగూడెం సమీపంలో కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం గ్రీవెన్స్‌డేలో అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పర్యావరణ కాలుష్యంపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు, వినతిపత్రాలను పరిశీలించిన అధికారులు సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం అభినందనీయం..



సూర్యాపేట ఆగస్టు 24.సూర్యాపేట మున్సిపాలిటీ కేంద్రంలోవార్డు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం అని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి. ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి . మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది . అన్నారు.ఈరోజు 29వ వార్డులో కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్.ఆధ్వర్యంలో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచితకంటి వైద్య ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర పర్యటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పటేల్ రమేష్ రెడ్డి.ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ., మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్ ని, వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు.నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, 40 సంవత్సరాలు దాటిన వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యం.డి. షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ పట్టణ అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, రాష్ట్ర,జిల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నంలో రోడ్డు ప్రమాదం, భార్య మృతి

ఎన్టీఆర్ జిల్లా, జ్యోతి ప్రభంజనం:ఇబ్రహీంపట్నం మండలం



గుంటుపల్లి శ్రీనివాస హోటల్ సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న దంపతులను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా.. భర్త తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## విదేశాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం..

**మొదటి పేజీ తరువాయి ..**

'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చింది. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారు? గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నాది చాటుమాటు పర్యటన కాదు..మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా



భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు.తెలంగాణ అంటే చిన్నచూపు..కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరంలేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# గుంతలమయంగా బడంగ్‌పేట్ రహదారి!

**సీసీ రోడ్డును తవ్వేశారు.. మరమ్మతులు మరిచారు**
**ఎన్నికల వేళ ఇంటింటికీ వచ్చి హామీలు.ఇప్పుడు ప్రజల గోడు పట్టదా?**
**రోడ్డు భద్రత ఎక్కడ? అభివృద్ధి ఎక్కడ? నాయకులు ఎక్కడ?**

రంగారెడ్డి, జ్యోతి ప్రభంజనం:రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బడంగ్‌పేట్‌లోని శ్రీనిలయం కమాన్ ఎదురుగా, మద్రాస్ కాపీ సమీపంలో రహదారి గుంతలమయంగా మారడంతో స్థానికులు



తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ వైర్ల పనుల కోసం మంచి సీసీ రోడ్డును తవ్వి గుంతలు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన గుంతలను సక్రమంగా పూడ్చకపోవడంతో నిత్యం ప్రమాదభయం నెలకొన్నదని మహిళలు, వాహనదారులు, కాలనీ నాయకులు వాపోతున్నారు.వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రోడ్డు ఎక్కడుందో.. గుంత ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంటోందని, ద్విచక్ర వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రహదారిపై నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎన్నికల హామీలు ఏమయ్యాయి?ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో బడంగ్‌పేట్ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, ఇంటింటికీ తిరిగి సీసీ రోడ్లు వేస్తామని, ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చిన రాజకీయ నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."ఎన్నికల సమయంలో ఇంటింటికీ వచ్చి హామీలు ఇవ్వడం కాదు.. గెలిచిన తర్వాత అదే ప్రజల మధ్యకు వచ్చి సమస్యలు పరిష్కరించాలి. సన్మానాలు, సభలు, గొప్పలు కాదు.. ప్రజలకు సురక్షితమైన రోడ్లు కావాలి" అని స్థానికులు ఘాటుగా వ్యాఖ్యానిస్తున్నారు.సన్మానాలకే పరిమితమా?ప్రజా సమస్యలపై నాయకులను కలవడానికి వెళ్తే సన్మానాలు, ఫొటోలు, హామీలతో సరిపెడుతున్నారని, సమస్యలను నేరుగా వివరించేందుకు అవకాశం లేకుండా కొందరు నాయకులు పీఏల ద్వారా విషయాలు చెప్పించి పంపిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల మధ్య ఉండాల్సిన ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన స్థానిక నాయకులు అభివృద్ధి విషయంలో ఎవరి బాధ్యత వారు తీసుకోవాలని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం కాకుండా రహదారుల పరిస్థితిని స్వయంగా పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.రోడ్డు భద్రతపై ఇంత నిర్లక్ష్యమా?"అభివృద్ధి అంటే సన్మానాలు కాదు.. ప్రజలు సురక్షితంగా నడిచే రహదారులు. నాయకుల గొప్పలు కాదు.. గుంతలు లేని రోడ్లే ప్రజలకు కావాలి" అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.గుంతల కారణంగా ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.పట్టించుకోకపోతే ఎన్నికల్లో బుద్ధి చెబుతాంబడంగ్‌పేట్‌లోని రహదారుల దుస్థితిని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలే తమ నిర్ణయాన్ని చూపిస్తారని స్థానికులు హెచ్చరిస్తున్నారు. "ప్రజల ఓట్లతో పదవులు వస్తాయి.. అదే ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజల తీర్పును ఎదుర్కోవాల్సిందే" అని నాయకులు, స్థానికులు హెచ్చరించారు.మహేశ్వరం నియోజకవర్గంలో బడంగ్‌పేట్ వంటి ప్రాంతాల్లో రహదారుల పరిస్థితి దయనీయంగా మారడం బాధాకరమని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బడంగ్‌పేట్ రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే స్థానికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే

సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం జ్యోతి ప్రభంజనం ఆగస్టు 23:పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తన మానవీయ కోణంతో మరోసారి అందరి మన్ననలు అందుకున్నారు. వివాహ కార్యక్రమాలు,గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని,తిరిగి పుట్టపర్తిలోని తన నివాసానికి వెళ్తున్న సమయంలో, స్విమ్మింగ్ పూల్ సమీపంలోజరిగిన రోడ్డు ప్రమాదాన్ని శ్రీధర్ రెడ్డి గమనించారు.ప్రమాదాన్ని గమనించిన వెంటనేతన కాన్వాయ్‌ను నిలిపి,క్షతగాత్రుల వద్దకు స్వయంగా వెళ్లి వారికి ధైర్యం చెప్పారు. ఏమాత్రం సమయం వృథా చేయకుండా,తన కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ఉపయోగించిబాధితులు ఇద్దరిని శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించారు. బాధితుల బంధువులు ఆసుపత్రికి చేరుకునే వరకూ అక్కడే ఉండి,వారికి అండగా నిలిచి అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం అని మరోసారి నిరూపించిన శ్రీధర్ రెడ్డి స్థానికులు,ప్రజలు హృదయ పూర్వకంగా అభినందిస్తున్నారు.అధికారంలో ఉన్నా,లేకున్నా



ప్రజాసేవే పరమావధిగా భావించే నాయకులు నేటికీ ఉన్నారని దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నిరూపించారు.

# గాంధీ ఆస్పత్రి వద్ద పేదలకు ఆపన్నహస్తం

**300 మందికి ఉచిత అన్నదానం..**
**సేవా కార్యక్రమాన్ని అభినందించిన పలువురు**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ఆగస్టు 24:ఆకలితో



బాధపడుతున్న పేదలకు అండగా నిలవాలనే సంకల్పంతో రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ అమ్మ హెల్పింగ్ హాండ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ ఆస్పత్రి వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన పేద రోగులు, వారి కుటుంబ సభ్యులు, ఇతర అవసరమైన వారికి సుమారు 300 మందికి ఉచితంగా భోజనం అందించారు.ఆస్పత్రిలో చికిత్స కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నేపథ్యంలో, వారికి భోజనం అందించడం ద్వారా మానవతా దృక్పథాన్ని చాటారు. ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తూ స్వయంగా ఆహారం వడ్డించారు. తమకు అందిన ఉచిత భోజనంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. సేవే లక్ష్యంగా..సమాజంలో ఆకలితో బాధపడుతున్న వారికి అండగా నిలవడంతో పాటు, అవసరమైన సమయంలో పేదలకు చేయూత అందించడమే తమ సంస్థల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ ఆంజనేయ ప్రసాద్, ఎస్‌బీఐ వైదేహీనగర్ బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ బి. శ్రీరామ కృష్ణ, రిటైర్డ్ ఏజీఎం ఎం. నాగమోహన్, నటుడు విజయ భాస్కర్ తదితరులు పాల్గొని ఆహారం వడ్డించారు.మరింత మందిని భాగస్వాములు కావాలని పిలుపుఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే దాతలు, స్వచ్ఛంద సేవకులు ముందుకు రావాలని కోరారు. సమాజ సేవలో మరింత మంది భాగస్వాములు అయితే అవసరమైన వారికి మరింత విస్తృతంగా సహాయం అందించగలమని తెలిపారు.పేదలకు ఆకలి తీర్చే ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందించడంతో పాటు, ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# సేవా కార్యక్రమాలతో పీడీజీ రవీందర్ నాథ్ గుప్తా జన్మదిన వేడుకలు

కాప్రా,జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 24:లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో పీడీజీ లయన్ రవీందర్ నాథ్ గుప్తా




జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు, సమాజంలోని అవసరమైన వర్గాలకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు.కీసర మండలం హరిదాస్‌పల్లి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర వేద పాఠశాలలో విద్యార్థులకు నెలవారీ నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం కాప్రా జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర వేద పాఠశాల అందిస్తున్న సేవలను అభినందించారు. సమీప ప్రాంతంలో విద్యార్థులకు వసతి కల్పిస్తూ వేద విద్యను అందిస్తున్న పాఠశాల ఉండటం అభినందనీయమన్నారు. సీతారామ శర్మ సనాతన ధర్మ పరిరక్షణ, ప్రచారం కోసం చేస్తున్న సేవలను ప్రశంసించారు. తన పదవీకాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు.కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ ఆసుపత్రి చైర్మన్ లయన్ కోత రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన వైద్య సహాయం అందించేందుకు తమ ఆసుపత్రి సిద్ధంగా ఉందన్నారు. విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలను సాధారణ రుసుములతో నిర్వహించేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధునాతన వైద్యం అవసరమైన సందర్భాల్లో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బి. లక్ష్మారెడ్డి సహకారంతో అవసరమైన వైద్య సహాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. లయన్ కోతపల్లి రాంబాబు మాట్లాడుతూ రవీందర్ నాథ్ గుప్తా జన్మదినోత్సవాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా, సంతృప్తిగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ఆధ్వర్యంలో భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ముఖ్యంగా వైద్య శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు, దంత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమాల్లో క్లబ్ అధ్యక్షుడు లయన్ చ. తారకేష్, సంయుక్త కార్యదర్శి లయన్ చంద్రబాబు, సంయుక్త కోశాధికారి లయన్ జి. రమేష్, ఉపాధ్యక్షులు లయన్ వాసి వెంకటేశ్వర్లు, లయన్ పెద్ది శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి లయన్ రామచందర్ రాజు, సీనియర్ లయన్స్ చందర్ శేఖర్, ఎం.ఎస్. పిల్లి, రవిశంకర్ రాజు, సిద్ధిపేట శ్రీనివాస్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.వైద్యం, విద్య, సామాజిక సంక్షేమం, నిరుపేదలకు సహాయం తదితర రంగాల్లో మరిన్ని అర్థవంతమైన సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ ప్రతినిధులు తెలిపారు.

# విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని పరిశీలించిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు...

**పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి...**

ఉప్పల్, జ్యోతి ప్రభంజనం,ఆగస్టు 24:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఉప్పల్ సర్కిల్ లోని రామంతపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహారాన్ని సోమవారం పరిశీలించారు. వారానికి ఐదు రకాల టిఫిన్స్ ను విద్యార్థులకు అందజేయడంతో పాటు పాలను అందజేస్తున్నారు. ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహారం చాలా బాగుందని,వాటిని తెస్తున్న డబ్బాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రామంతపూర్ స్కూల్ లో చాలా సమస్యలు ఉన్నాయి, విద్యార్థులు ఎక్కువగా ఉండటం వల్ల చదువుకోవడానికి తరగతి గదులు లేక సోలార్ ప్యానల్ కింద చదువుకునే పరిస్థితి ఉన్నది. ప్రైమరీ స్కూల్ లో ప్లే స్కూల్ విద్యార్థులకు క్లాస్ రూమ్ చిన్నగా ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారని స్కూల్ లో నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగడానికి,వాష్ రూమ్ లో వాడుకోవడానికి సరిపోకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.ఈ సమస్యలను అధికారుల దృష్టికి పాలకుల దృష్టికి తెచ్చినప్పటికీ ప్రయోజనం లేదని ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి



రామంతపూర్ స్కూల్ లో గల సమస్యలను పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోసుల విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు టి రవీందర్రావు పాల్గొన్నారు.

# సారంపల్లి మల్లారెడ్డికి ఘన నివాళులు.

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 24(జ్యోతి ప్రభంజనం): ఏఐకేయస్ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి మృతి రైతాంగానికి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు నర్సింహ్మ అన్నారు. సోమవారం చిట్యాలలో సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి ఏర్పాటు చేసిన ప్లెక్సీ వద్ద వారు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సారంపల్లి మల్లారెడ్డి రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడని కొనియాడారు. రైతాంగ హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన మృతి రైతు ఉద్యమానికి తీరని లోటని అన్నారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల నాయకులు గుడిసె లక్ష్మీనారాయణ, బెల్లి మల్లేశం, అక్కెనపల్లి నాగయ్య,



జిట్ట స్వామి, బూరుగు కృష్ణవేణి, గోదుమగడ్డ వెంకట్రెడ్డి, చిర్రబోయిన గట్టయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నాగిళ్ళ భవ్యశ్రీ నామకరణ మహోత్సవం

**సైదాబాద్‌లో కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషుల సమక్షంలో వేడుకలు**

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం :రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యులు, సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యులు, సింగరేణి కాలనీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగిళ్ల రమేష్, ఆయన సతీమణి అనిత దంపతుల కుమార్తె భవ్యశ్రీ నామకరణ మహోత్సవ కార్యక్రమం సైదాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సన్నిహితులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై చిన్నారి భవ్యశ్రీకి ఆశీస్సులు అందజేశారు. వేదపండితుల ఆశీర్వచనాల మధ్య సంప్రదాయబద్ధంగా నామకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారి భవ్యశ్రీ ఆరోగ్యంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు. నామకరణ మహోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులు అతిథులకు ఆత్మీయ



స్వాగతం పలికి, వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషుల సందడితో పండుగ వాతావరణాన్ని తలపించింది.

# హామీలను అమలు చేయాలి

**– సిపిఎం నేత పోతినేని సుదర్శన్**

**– కార్మికుల సమ్మెకు సిపిఎం మద్దతు**

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):ట్రాన్స్పోర్ట్ కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తెలిపారు. స్థానిక మంచికంటి భవన్లో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి నుండి ఆటో కార్మికులు ప్రైవేటు వ్యాను స్కూల్ వ్యాన్లు బందును జయప్రదం చేయాలని ఈ బంద్ కు ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు పన్నెండు వేల రూపాయలు ఇస్తానన్న ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆర్టీసీ సంస్థ తరఫున ఎలక్ట్రికల్ ఆటో వాహనాలు నడపాలని చేస్తున్న ప్రయత్నం రద్దు చేయాలని రాపిడో ఓలా ఉబర్ రద్దుచేసి ప్రభుత్వమే యాప్ ద్వారా రాపిడో సంస్థను నడపాలని తదితర సమస్యల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటోలు బంద్ చేయాలని కార్మిక సంఘాల జేఎసి పిలుపునివ్వడం జరిగిందనీ రవాణా శాఖ మంత్రి కార్మిక సంఘాలు చేపట్టిన బంద్ విరమించాలని ప్రకటనకే పరిమితం అయ్యారు తప్ప కార్మిక సంఘాల జేఎసితో ఎందుకు చర్చలు జరిపరని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. రవాణా రంగ కార్మికులు కుటుంబాన్ని పోషించలేక అప్పుల పాలయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రవాణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మచ్చా



వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, కారం పుల్లయ్య, బ్రహ్మచారి, లిక్కి బాలరాజు, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ ఏ నబి, నిమ్మల వెంకన్న, వంశీ, పిట్టల అర్జున్, చిలకమ్మ, వీర్ల రమేష్, గడ్డం స్వామి, భూక్య రమేష్, కోబల్, నరేష్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# మల్లారెడ్డి మృతి పేద ప్రజలకు, రైతాంగ ఉద్యమాలకు తీరని లోటు

**సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి**



కరీంనగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,ఆగస్టు 24: సీపీఎం పార్టీ సీనియర్ నేత, రైతు ఉద్యమ నాయకుడు, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి మృతి పేద ప్రజలకు, దేశ రైతాంగ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు.సోమవారం కరీంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయం ఎదుట పార్టీ జెండాను అవనతం చేసి, మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు సారంపల్లి మల్లారెడ్డి (88) తుదిశ్వాస విడిచారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘం నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. వ్యవసాయ రంగ నిపుణుడిగా, నీటిపారుదల రంగంపై అపార అవగాహన కలిగిన నాయకుడిగా ఆయన సేవలందించారని అన్నారు.మల్లారెడ్డి వద్ద అనేకమంది రాజకీయ నాయకులు, అధికారులు సైతం సలహాలు, సూచనలు తీసుకునేవారని తెలిపారు. ఆయన మృతి తీవ్రంగా బాధించిందని పేర్కొంటూ సీపీఎం కరీంనగర్ జిల్లా కమిటీ తరఫున సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కరీంనగర్ జిల్లాలో రైతు ఉద్యమాల్లో మల్లారెడ్డి ప్రత్యక్షంగా పాల్గొన్నారని వాసుదేవరెడ్డి తెలిపారు. పేద ప్రజలకు ఇళ్ల స్థలాల కోసం నిర్వహించిన పోరాటాలు, భూ నిర్వాసితుల ఆందోళనలు, ప్రాజెక్టుల సాధన కోసం చేపట్టిన ఉద్యమాలు, పాదయాత్రల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. జిల్లాలో మూడు దశాబ్దాలపాటు పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.వరంగల్ జిల్లాలో జన్మించిన మల్లారెడ్డి అక్కడ సీపీఎం, రైతు సంఘాల నిర్మాణంలో విశేష కృషి చేశారని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. కమ్యూనిస్టు నాయకుడిగా నిరాడంబరమైన జీవితాన్ని



గడిపిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.మల్లారెడ్డి ఆశయాలు, స్ఫూర్తితో జిల్లాలో మరింత బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని వాసుదేవరెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గిట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, సుంకరి సంపత్, ఎడ్ల రమేష్, డి.నరేష్, కొప్పుల శంకర్, నాయకులు గజ్జల శ్రీకాంత్, అరవింద్, సంధ్య, రజిత, ఇసాక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలు కురవాలని కప్పకాముడు కి పూజలు

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 24(జ్యోతి ప్రభంజనం):చిట్యాల మండలంలోని నేరడ గ్రామ పంచాయతీ పరిధిలోని సూదిరెడ్డిగూడెంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామస్థులు ఆదివారం సంప్రదాయబద్ధంగా 'కప్పకాముడు' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని పాటలు పాడుతూ ఇంటింటికీ తిరిగి కప్పకాముడు ఆడారు.ఈ సందర్భంగా రోకలి కర్రకు బట్టలో కప్పలను కప్పి ఉంచి, వాటిపై పసుపు నీరు చల్లుతూ గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ సంప్రదాయ పాటలు పాడారు. వర్షాలు కురిపించాలని దేవుడిని వేడుకుంటూ తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు.ఈ కార్యక్రమంలో సూదిరెడ్డి వసంత, మెండె కేతమ్మ, ఈశ్వరమ్మ, పద్మ, మంజుల, జయమ్మ, శోభ,



సువర్ణ, పార్వతమ్మ, సునితతో పాటు పలువురు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చారు? నిలబెట్టుకున్నారు..

**ఆడబిడ్డ వివాహానికి రూ. 15,116 కానుక.**

చిట్యాల,నల్లగొండ: ఆగస్టు 24(జ్యోతి ప్రభంజనం):ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ చిట్యాల మున్సిపాలిటీ 5వ వార్డులో మరో ఆడబిడ్డ వివాహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు వివాహ కానుక అందజేశారు.5వ వార్డుకు చెందిన ఏషబోయిన రేణుక?శేఖర్ దంపతుల కుమార్తె అక్షిత వివాహం సందర్భంగా ఆదివారం రూ.15,116లను వివాహ కానుకగా అందజేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో 5వ వార్డులో వివాహం చేసుకునే ప్రతి ఆడబిడ్డకు వివాహ కానుక అందజేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఈ నగదును అందించినట్లు వైస్ చైర్మన్ తెలిపారు.ఈ సందర్భంగా గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం తమ బాధ్యత అన్నారు. వార్డులో వివాహం చేసుకునే ప్రతి ఆడబిడ్డకు హామీ మేరకు వివాహ కానుక అందజేస్తామని స్పష్టం చేశారు. ఆడబిడ్డల కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పునూతల నర్సింహ్మా, శిరబోయిన



కృష్ణ, జంగిలి సైదులు, ఎడ్ల మురళి, ఎడ్ల శ్రీశైలం, ఈర్ల వెంకన్న, సాగర్ల మహేష్, కడారి సత్యనారాయణ, రాధారపు గిరి, జంపాల వెంకన్న, చిరబోయిన యాదయ్య, గుండెబోయిన శివసాయి, ఏళ్ల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం,పల్లెలే పట్టణాలకు పట్టుకొమ్మలు అనే మాట అక్షరాల నిజమని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి



ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం హైదరాబాద్ చిక్కడపల్లి లోని త్యాగరాయ గానసభ నందు ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా యువ కవి కె.మురళీమోహన్ రాజు కలం నుండి జాలువారిన 'బతుకు బండి' కవితా సంపుటిని డాక్టర్ సేవారత్న కొండూరు హరినారాయణకు అంకితం చేస్తూ సిరికొండ మధుసూదనా చారి పుస్తకాన్ని ఆవిష్కరించారు.అనంతరం వివిధరంగాలలో ప్రతిభ చూపించిన ప్రముఖులు ప్రతిభా అవార్డు గ్రహీతలు నర్ల సుధ, బలిజేపల్లి నాగరత్నం, కామసాని కృష్ణారెడ్డి, మల్లెపాకుల మణెమ్మ, ఓంకారం శివసాయి రాజు, రేవెల్లి పద్మ లను శాలువా, మెడల్, మొమెంటో, కిరీట దారణతో ఘనంగా సత్కరించారు.ఈకార్యక్రమంలో డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి, డాక్టర్ బూర్గుల మధుసూదనరావు, నిర్మలా ప్రభాకర్, ఎన్. వేణుగోపాల శర్మ, రచయిత దుబ్బా భాస్కర్ రావు, డాక్టర్ రాధ కుసుమ, రచయిత మురళీమోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి ..**

సోమవారం మెదక్ హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా ఖంఅ సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ. కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారు' అని తెలిపారు.సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని.. కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**